# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 116

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy    సంపాదకులు : కె.భాస్కర్‌రావు    రూ.2.00/- పేజీలు 8    తేది: శుక్రవారం 15 మే 2026










**సమయం ప్రతినిధి:** పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, అంతర్జాతీయ చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు సూత్రాలు పాటించాలని ప్రభుత్వాలతోపాటు ప్రజలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఉద్యోగులపై కేంద్రం కొత్త ఆంక్షలు విధించింది. కార్లు వదలి.. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించాలని ప్రజలకు స్పష్టం చేసింది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక రవాణా ప్రణాళికను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ప్రభుత్వ క్వార్టర్ల నుంచి కార్యాలయాలకు వెళ్లేందుకు మెట్రో స్టేషన్ల మీదుగా ప్రత్యేక షటిల్ బస్సులు ప్రారంభించినట్లు తెలిపింది. మెట్రో, బస్సుల్లో ప్రయాణించే ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం అదనపు రవాణా భత్యాన్ని పెంచుతామని ప్రకటించింది. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల పని వేళల్లో మార్పుల కోసం కీలక ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించింది.నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (NCMC) వాడే ఉద్యోగులకు ఆ కార్డులో ముందే నగదు చెల్లించాలని నిర్ణయించినట్లు కేంద్రం పేర్కొంది.




**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు ఘటన దేశాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తొలి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. న్యూఢిల్లీలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో 7,500 పేజీల ఛార్జ్‌షీట్‌ను సమర్పించింది. 2025 నవంబర్ 10వ తేదీ సాయంత్రం డాక్టర్ ఉమర్ ఉన్ నబీ కారు నడుపుకుంటూ వచ్చి ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో 11 మంది మృతిచెందగా.. పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ పేలుడు ఘటనపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ సుదీర్ఘ దర్యాప్తు చేపట్టింది. జమ్మూకాశ్మీర్, హర్యానా, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ సహా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో కేసును విస్తృతంగా విచారించింది. 588 మంది వాంగ్మూలాలతో పాటు వివిధ రకాల సాక్ష్యాలను సేకరించింది. ఛార్జ్‌షీట్‌లో ఎన్ఐఏ పలు కీలక అంశాలను వెల్లడించింది. కారు పేలుడులో మృతిచెందిన డాక్టర్ ఉమర్ ఉన్ నబీ సహా 10 మందికి అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ (AGuH) సంస్థతో సంబంధం ఉందని తెలిపింది.




**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా వినియోగంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పొదుపు సూత్రాల పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణ, ప్రజా రవాణా ప్రోత్సాహంపై కేంద్రీకృతమై ఉన్నాయి.

### ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్

ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ఇంధన వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులకు వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని సీఎం రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

## కేరళం సీఎం వీడీ సతీశన్‌కు రేవంత్‌రెడ్డి అభినందనలు



**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు.

**తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫార్ములా ఈ కారు రేసు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏసీబీ కోర్టు ఈ కేసుకు సంబంధించిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకుని, నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డికి సమన్లు జారీ చేసింది.**




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** జూలై 31వ తేదీన విచారణకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

### ఫార్ములా ఈ రేస్ కేసును స్వీకరించిన ఏసీబీ కోర్టు..

2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ కారు రేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై నమోదైన కేసులో ఇప్పటికే ఏసీబీ అభియోగపత్రం దాఖలు చేసింది. తాజాగా ఆ ఛార్జ్‌షీట్‌ను ఏసీబీ కోర్టు విచారణకు స్వీకరించడం కీలకంగా మారింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థను చేర్చింది.

**రూ.55 కోట్ల బదిలీపై ఆరోపణలు..** ఫార్ములా ఈ కారు రేసు నిర్వహణ కోసం విదేశీ సంస్థ అయిన ఎఫ్ఈఓకు నిధులు బదిలీ చేసిన వ్యవహారంపై ఈ కేసు నమోదైంది.






## మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలి



### కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం తనిఖీ

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** జిల్లాలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డును సందర్శించిన కలెక్టర్ మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించి లోడింగ్, అన్‌లోడింగ్, నిల్వ ప్రక్రియలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు సుమారు 40 వేల బస్తాలు కొనుగోలు చేసి తాత్కాలిక నిల్వ చేసినట్లు, మరో 30 వేల బస్తాలు కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. టోకెన్ల ఆధారంగా రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలి పారు. హమాలీలను అదనంగా నియమించి లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను ఎక్కువకాలం మార్కెట్ యార్డులో నిల్వ ఉంచ కుండా గుర్తించిన గోదాములకు తరలించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడడంతో పాటు గన్నీ బ్యాగుల కొరత లేకుండా సరఫరా చేయాలని, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రవాణా కోసం తగిన లారీలు, ట్రక్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కూడా మార్కెట్ యార్డును సందర్శించి కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా సహకార, వ్యవసాయ శాఖల అధికారులు, మార్క్‌ఫెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మారిన రాజకీయం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ఇరవయ్యవ శతాబ్దం మొదటి ఐదు దశాబ్దాలు రెండు ప్రపంచ యుద్ధాలు, వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమాలు చరిత్రను చాలా మలుపులు తిప్పాయి. మన దేశం కూడా ఆ చరిత్రలో భాగమే. గత ఎనిమిది దశాబ్దాలుగా భారతదేశంలో రాజ్యాంగం ఆధారిత ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది. స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో వచ్చిన కొన్ని నవలల్లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది అని భావోద్వేగంతో ఒక మధ్యతరగతి ఒక పేదవాడికి చెపితే, "అయితే ఏమవుతుంది?" అని అమాయకంగా అడగడం మనోహర్ మలగాంకర్ తన 'బెండ్ ఇన్ గాంజెస్' అనే నవలలో రాశాడు. మన ప్రాంతంలో చాలా చర్చకు వచ్చిన కన్యాశుల్కంలోని జట్కావాడు... "భారత దేశానికి స్వాతంత్ర్యం రాబోతున్నది" అని గిరీశం అంటే–"మన ఊరిలోని హెడ్ కానిస్టేబుల్ మారతాడా?" అన్న ప్రశ్న చాలా దూరదృష్టితో రాసిందే. సంభాషణ చాలా సాధారణమైనదిగా కనిపించినా బలప్రయోగం లేని ఒక రాజ్యం వస్తుందా అన్న పేదవాడి ప్రశ్న అప్పటికంటే ఇప్పుడు ఎక్కువ రెలవెంట్ అనిపిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే రాజ్య బలప్రయోగం మీద నియంత్రణ.పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చాలా ఆటుపోట్లకు గురయ్యింది. చాలా మూడవ ప్రపంచ దేశాలలో ఈ మాత్రం ప్రజాస్వామ్యం కొద్దికాలమైనా నిలువలేకపోయింది. చాలా దేశాలు నియంతృత్వంలోకి, సైనిక పాలనలోకి వెళ్లిపోయాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగడానికి ఒక సమగ్రమైన రాజ్యాంగం తోడ్పడింది. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలకమైన పాత్ర నిర్వహించాడనే కీర్తి ఆయనకు దక్కింది. రాజ్యాంగం మీద దాడి పెరిగిన కొద్దీ అంబేడ్కర్‌ను మననం చేసుకోవడం పెరుగుతున్నది. ఈ రాజ్యాంగంలోని ప్రాపంచిక దృక్పథం పెట్టుబడిదారీ ఆర్థిక నమూనాని ఒకవైపు అంగీకరిస్తూనే సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని ఒక మధ్యేమార్గ ప్రయోగాన్ని వాగ్దానం చేసింది. ధనిక వర్గాలకి పెట్టుబడిదారీ పంథా, పేద వర్గాలకు సోషలిస్టు వ్యవస్థ అన్న ఒక మార్గం వేసే ప్రయత్నం చేసింది. దేశం ఎనిమిది దశాబ్దాలుగా ఒక చిక్కు మార్గంలోనే చిక్కుకుంది.

ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా పేదల ప్రస్తావన లేకుండా, అసమానతల తగ్గింపు, అందరికీ అవకాశాలు, మనుషులంతా సమానమే అన్న భావన లేకుండా నిలువడం కష్టం. అందరూ సమానమే అన్న భావనను డా. అంబేడ్కర్ చాలా దూరదృష్టితో, ఎన్నికలలో రాజకీయంగా మనం సమానత్వాన్ని కల్పించాం. ఒక మనిషి, ఒక ఓటు, ఒకే విలువ. ఈ సమానత్వం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోతే మనం ఎంతో కష్టపడి నిర్మించుకున్న ప్రజాస్వామ్య సౌధాన్ని ప్రజలు బద్దలుకొడతారు అని హెచ్చరిక చేశాడు. కానీ విచిత్రంగా సామాన్య ప్రజలు రాజ్యాంగాన్ని స్వంతం చేసుకుంటున్నారు, పాలకులు రాజ్యాంగం మీద దాడి చేస్తున్నారు. ఎన్నికల రాజకీయాలలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం డా. అంబేడ్కర్ ఆశించిన సమానత్వ దిశలో కాక సమాజంలోని తీవ్ర అసమానతలు ఎన్నికలను నిర్దేశించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత ఎనిమిది దశాబ్దాలలో మొదటి రెండు దశాబ్దాలలో సోషలిస్టు నమూనా లాంటి వ్యవస్థ అన్న భావజాలం ప్రచారంలో ఉండేది. కానీ క్రమక్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతూ వచ్చింది. ఇందిరాగాంధీ నాయకత్వంలో ఈ వైరుధ్యం కొంత స్పష్టత పొంది సమాజంలోని అసంతృప్తి విభిన్న ఉద్యమాలకు దారితీసింది. ఈ అసంతృప్తిని గ్రహించిన ఇందిరాగాంధీ పేదరికాన్ని రాజకీయాలలో ఒక ప్రధాన అంశంగా ముందుకు తీసుకు రావడంతో ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లను సమీకరించుకోగలిగారు. ఆమె భావజాలం వల్ల ధనిక వర్గాల సమీకరణ బలపడడం, పేద వర్గాల ఆకాంక్షలు పెరగడం వల్ల వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో సంక్షోభంలో చిక్కుకున్న ఇందిరాగాంధీ... రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను రద్దు చేసి, అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భారతదేశంలోని 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం' (కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఎంత బలహీనంగా ఉందో ఒక్కసారి బయటపడింది. ఏ కారణం వల్ల ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ప్రకటించిందో ఇప్పటికీ ఆ కారణాలు పూర్తిగా విశ్లేషించలేదు. ఆమె ఎన్నికలు ప్రకటించినప్పుడు జయప్రకాశ్ నారాయణ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, అరుణ్‌శౌరి కలిసి ప్రతిపక్షాలు ఏం చేయాలి అని చర్చించినప్పుడు అరుణ్‌శౌరి ఎన్నికలను బహిష్కరించాలి అని ప్రతిపాదిస్తూ... "నియంత ఎప్పుడూ తన విజయాన్ని గ్యారెంటీ చేసుకోకుండా ఎన్నికలకు వెళ్లరు" అని అంటే, "ప్రజలను మనం అంత తక్కువ అంచనా వేయకూడదు. సమాజం భయంలో ఉన్న మాట వాస్తవం. జనాన్ని మనం సమీకరించగలిగితే వ్యక్తులుగా భయపడుతున్న వాళ్లే సమిష్టిలో ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. భయానికి మందు సమిష్టిలోనే ఉంది" అని జయప్రకాశ్ నారాయణ్ చెప్పారని అరుణ్‌శౌరి వ్యక్తిగత చర్చలో నాతో అన్నాడు. అటల్‌బిహారి వాజ్‌పాయ్ కూడా జేపీ వాదనతో అంగీకరించడంతో ఎన్నికలలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకున్నామని అరుణ్‌శౌరి అన్నాడు.

ఎన్నికల రాజకీయ చరిత్రలో మనదేశంలో 1977లో మొదటిసారిగా ప్రజలు భయం నుంచి బయటపడి అధికార పార్టీనే కాక, వ్యక్తిగతంగా ఇందిరాగాంధీని కూడా ఓడించారు. అప్పటి వరకు బలమైన నాయకుడు లేదా నాయకత్వం కేంద్రంగా నడిచే రాజకీయాల స్థానంలో సమిష్టి నాయకత్వం అధికారంలోకి వచ్చింది. భావజాలపరంగా భిన్న భావజాలాలున్న కమ్యూనిస్టు పార్టీ, జార్జ్ ఫెర్నాండెజ్, జగ్జీవన్‌రాం, మొరార్జీ దేశాయ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, అద్వాణీ... ఈ సమిష్టి నాయకత్వంలో భాగం. ఇంత వైవిధ్యమైన, వైరుధ్యమైన సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేకపోయింది. ఎన్నికలలో ప్రజలు అంత పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినా, అంత ప్రజాబలం ఉన్నా జనతా పార్టీ కూలిపోవడం వెనుక ఓట్ల రాజకీయాల కంటే భిన్న ప్రయోజనాల మధ్య వైరుధ్యాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నదన్నది ఒక వాస్తవ అనుభవంలోకి వచ్చింది. ఇందిరాగాంధీ రెండవసారి గెలిచినప్పుడు ఆమె రాజకీయ పరిభాషలో చాలా మార్పు వచ్చింది. ప్రధానంగా ఆమె పేదల గురించి మాట్లాడడం చాలావరకు తగ్గించింది. భిన్న వర్గాల మధ్య వైరుధ్యాలు ఎక్కడికి దారితీస్తాయో అన్న అనుమానంతో 'దేశ సమగ్రత, సమైక్యత' అనే నినాదాన్ని ముందుకు తీసుకువచ్చింది. దీంతో బాటు తన సోషలిస్టు భావజాలం స్థానంలో పెట్టుబడిదారీ మార్గమే ఏకైక మార్గం అనే నిర్ణయానికి రావడం, ఆమె హఠాన్మరణంతో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి కావడంతో రాజ్యాంగంలోని సోషలిస్టు భావజాలం గురించి మాట్లాడడం దాదాపు రద్దైపోయింది.

# విద్యారంగంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ -1



**వనపర్తి, సమయం ప్రతినిధి:** తెలంగాణను విద్యారంగంలో దేశంలో నెంబర్-1 రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం పెబ్బేరు పట్టణంలో మోడల్ అంగన్వాడీ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి లు ముఖ్య అతిథులుగా హాజరై మోడల్ అంగన్వాడీ కేంద్రాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పెబ్బేరు మండలంలో ఏబిడి లిక్కర్ ఫ్యాక్టరీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ. 49 లక్షల నిధులతో మండల పరిధిలో 13 అంగన్వాడీ కేంద్రాలను ఆధునికరించి మోడల్ అంగన్వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దారు.

గురువారం ప్రారంభించిన వాటిలో పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న మోడల్ అంగన్వాడీ కేంద్రం, పెబ్బేరు లోని రెండో వార్డులో అంగన్వాడీ కేంద్రం, చెలిమిల్లలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని 2వ వార్డులో ఏర్పాటు చేసిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో తెలంగాణను విద్యారంగంలో నెంబర్-1 రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహార పథకం త్వరలోనే అమలు చేయనున్నట్లు తెలిపారు. సన్న బియ్యం, మెస్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలు పెంపు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా పెట్టుబడులు పెడుతోందని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని కోరారు. అలాగే ఏబిడి కంపెనీ వారు సీఎస్ఆర్ నిధుల కింద రెండు శాతం నిధులను, పెబ్బేరు మండలంలో విద్యారంగం మరియు పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు కాంపౌండ్ వాల్, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే విధంగా వారు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ బీడీ లిక్కర్ కంపెనీ ఆధ్వర్యంలో పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండల పరిధిలో 13 అంగన్వాడి కేంద్రాలను మోడల్ అంగన్వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దడం అభినందనీయమని తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలను మోడల్ అంగన్వాడీలుగా తీర్చిదిద్దినందుకు ఏబీడీ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రజలు సంరక్షించుకోవాలని బాగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎబిడి లిక్కర్ కంపెనీ డైరెక్టర్ రాజేష్, కంపెనీ ప్రతినిధులు ఉమాశంకర్, వెంకటేశ్వర్ రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్ పర్సన్ సుమిత్ర, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం-మణుగూరు రైల్వే లైన్

కరీంనగర్ : ఉత్తర తెలంగాణ ప్రజల పాతికేళ్ల నిరీక్షణకు తెరపడింది. రామగుండం-మణుగూరు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడమే కాకుండా.. 2026-27 బడ్జెట్‌లో ఏకంగా రూ.2911.84 కోట్ల నిధులు కేటాయించింది. సుమారు 208 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే మార్గం సింగరేణి బొగ్గు రవాణాకు కీలకమైన 'కోల్ కారిడార్'గా మారనుంది. మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు అనుసంధానం కల్పిస్తూనే, భద్రాచలం-రామగుండం మధ్య ప్రయాణ దూరాన్ని 90 కిలోమీటర్ల మేర తగ్గించనుంది. ప్రస్తుతం ఈ లైన్ నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి.ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త రైల్వే ప్రాజెక్టు పట్టాలెక్కడానికి సర్వం సిద్ధమైంది. రామగుండం-మణుగూరు మధ్య రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న పాతికేళ్ల నాటి కల ఇప్పుడు సాకారమవుతోంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే కాకుండా.. పనుల వేగవంతానికి 2026-27 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో రూ.2911.84 కోట్ల భారీ నిధులను కేటాయించింది. దీంతో దశాబ్దాల కాలంగా సాగుతున్న ప్రజల నిరీక్షణకు తెరపడటమే కాకుండా.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సరికొత్త బాటలు పడనున్నాయి.ఈ రైల్వే మార్గం కేవలం ప్రయాణికుల కోసమే కాకుండా.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాలను కలుపుతూ ఒక వ్యూహాత్మక కోల్ కారిడార్‌గా రూపుదిద్దుకోనుంది. దీనివల్ల బొగ్గు రవాణా వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, రవాణా ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ప్రస్తుతం భద్రాచలం నుంచి రామగుండం చేరుకోవడానికి సుమారు 286 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉండగా.. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే ఆ దూరం 90 కిలోమీటర్ల మేర తగ్గిపోనుంది. ఇది ఇటు సింగరేణి సంస్థకు, అటు ప్రయాణికులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.మొత్తం 207.80 కిలోమీటర్ల పొడవైన ఈ నూతన బ్రాడ్ గేజ్ మార్గం పెద్దపల్లి జిల్లాలోని రాఘవాపురం వద్ద ప్రారంభమై మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, కాటాపురం మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు సాగనుంది. ముఖ్యంగా ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు రైలు సౌకర్యం కలగడం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం. గతేడాది మే నెలలోనే భూసేకరణ ప్రకటన వెలువడగా.. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సర్వేలు, భూపరీక్షలు పూర్తి కావడంతో పనులు వేగంగా మొదలుకానున్నాయి.ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే న్యూఢిల్లీ-చెన్నై గ్రాండ్ ట్రంక్, నాగ్‌పూర్-విజయవాడ సెక్షన్లకు ఇది ఒక బలమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది. భవిష్యత్తులో దీనిని భద్రాచలం-కొవ్వూరు మార్గంతో అనుసంధానించడం ద్వారా విశాఖపట్నం పోర్టు వరకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచవచ్చని అధికారులు భావిస్తున్నారు. రూ.4 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టును వచ్చే 10-15 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కాగా, రామగుండం-మణుగూరు రైల్వే మార్గం ఆమోదం శుభపరిణామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు దీనివల్ల ప్రయాణ సౌకర్యాలు మెరుగవుతాయని చెప్పారు. అనేక పర్యాయాలు కేంద్ర రైల్వే శాఖకు విన్నవించానని.. పార్లమెంట్‌లోనూ మాట్లాడినట్లు ఎంపీ ఈటల రాజేందర్ చెప్పుకొచ్చారు.

# బెంగాల్ సీన్ రిపీట్ అవుతుందా

హైదరాబాద్ : తెలంగాణా రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకుని రావాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. తమ పార్టీకి ఒక్క చాన్స్ ఇవ్వాలని ఆయన తెలంగాణా ప్రజలకు వినతి చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ కి అధికారం ఇస్తే తెలంగాణా ప్రగతిపథంలో దూసుకుని పోతుందని మోడీ చెప్పుకొచ్చారు. తెలంగాణా రాష్ట్రాన్ని పాలకులు అవినీతి మయం చేశారు అని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ఏలుబడిలో ఎక్కువ అవినీతి జరిగిందని అన్నారు. అందుకే ఆ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళు పై దాటిందని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అభివృద్ధి చేయకుండా నమ్మించి మోసం చేస్తోంది అని నరేంద్ర మోడీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ప్రజలు తరిమికొట్టి కాషాయానికి పట్టం కట్టాలని ఆయన కోరారు.పశ్చిమ బెంగాల్ ప్రజలు అక్కడ అవినీతి ప్రభుత్వాన్ని ఓడించి బీజేపీ పాలనకు పట్టం కట్టారు అని మోడీ చెప్పుకొచ్చారు. దేశమంతటా బీజేపీ ప్రభంజనం వీస్తోందని ఆయన చెప్పారు. ఇక బీఆర్ఎస్ కాంగ్రెస్ లను ఓడించి ఈసారి చాన్స్ బీజేపీకి ఇవ్వమని ఆయన కోరారు. ఒక్క చాన్స్ ఇస్తే చాలు అద్భుతమైన ఫలితాలను అందిస్తామని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పెడతామని కూడా అంటున్నారు. అయితే ప్రజలు సిద్ధంగా ఉన్నారా అన్నది పక్కన పెడితే తెలంగాణా బీజేపీ రెడీగా ఉందా అన్న చర్చ ముందుకు వస్తోంది. బాధ్యతగల పౌరుడిగా గుర్తించండి.మిగిలిన రాష్ట్రాలలో బీజేపీ గెలుపు కోసం పార్టీ క్యాడర్ అంతా రోడ్డున ఉంటారు. నాయకులు సైతం వీధుల్లోకి వస్తారు. బెంగాల్ లో గత పదేళ్ళుగా బీజేపీ పడిన కష్టమే ఈ రోజు విజయం. ఒక్కో నాయకుడిదీ ఒక్కో వీరోచిత పోరాటం. బెంగాల్ లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ని ఎదిరించి నిలబడడం అంటే మాటలు కాదు, కానీ తెగించి వచ్చారు. అలా చేయడం వల్లనే పార్టీ బతికింది. ప్రజా సమస్యల మీద పోరాటం చేయడం వల్లనే బీజేపీ వైపు జనాలు చూశారు. ఆ విధంగా ప్రభుత్వ వ్యతిరేకత కాస్తా బీజేపీ వైపు మళ్ళింది. తెలంగాణాలో బీజేపీ చూస్తే మూడు గ్రూపులూ ఆరు వర్గాలుగా ఉంది. అందరూ నాయకులే అన్నట్లుగా ఉంది గతంలో కాంగ్రెస్ ఏ విధంగా ఉందో ఆ పరిస్థితి ఉందని అంటున్నారు. ఇపుడు తెలంగాణా కాంగ్రెస్ ఏకీకృతం అవుతోంది. రేవంత్ రెడ్డి అందరినీ కలుపుకుని పోతున్నారు. కానీ బీజేపీలో మాత్రం ఆ పరిస్థితి లేదని అంతా అంటున్నారు నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి బీజేపీని కదిలించాల్సి వస్తోంది. కానీ ఈ తరహా ఉత్సాహాన్ని సభలు పెట్టి పార్టీ నేతలు చేయాల్సి ఉంది కదా అని అంటున్నారు. మొత్తానికి చూస్తే సౌత్ కి గేట్ వేగా తెలంగాణాను బీజేపీ పెద్దలు భావిస్తున్నారు కానీ తెలంగాణా బీజేపీ నేతలు సమాయత్తం అయితేనే అది సాధ్యపడుతుంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం : దేవరకద్ర ఎమ్మెల్యే



**(సమయం ప్రతినిధి దేవరకద్ర నియోజకవర్గం):** మదనపురం మండలం తిరుమలయ్య పల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో దేవరకద్ర ఎమ్మెల్యే .జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొన్నరు.అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహవిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు.అన్ని వర్గాలకు సమ హక్కులను కల్పిస్తూ అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని రచించారని, అంబేద్కర్ స్ఫూర్తి తో కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతుందని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందరం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# గురుకులాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన మంత్రులు







**(సమయం ప్రతినిధి హైదరాబాద్) :** బంజారాహిల్స్ కొమురంభీం భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు సంక్షేమ హాస్టల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు మంత్రులు అందజేశారు. ముఖ్య అతిథిగా మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి హాజరయ్యారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు,బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతు"విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం"అంటే విద్య వినయాన్ని ఇస్తుంది, వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఉద్బోధించారు.విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకు వస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు పూలే లు చెప్పారని తెలంగాణ రైజింగ్ లో ప్రతి విద్యార్థి భాగం కావాలని పిలుపు ఇచ్చారు. విద్య ఎవరి సొత్తు కాదు,సరస్వతి దేవికి రంగు, రూపు తేడా ఉండదంటూ విద్యపై మనం చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుందని గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం కనుక 100% ఉత్తీర్ణత సాధించాలని అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలని ఆకాంక్షించారు. 100 సంవత్సరాలుగా చేయని కుల గణన ను ప్రజా ప్రభుత్వం చేసిందని విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని గుర్తు చేశారు. అవకాశాన్ని సృష్టించుకున్నవాళ్లే సమర్థులు అవుతారన్నారు. రాజకీయాలు అనగానే ఒక ధోరణి ని విడనాడాలని భవిష్యత్ లో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలన్నారు.రాజకీయ నాయకులు చేసే చట్టాలు దేశ భవిష్యత్తును మారుస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం విప్లవాత్మకంగా మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## బీజేపీ నాయకుడు చెన్నం గారి మహేష్‌కు నివాళులర్పించిన ప్రభుత్వ విప్



మహబూబ్ నగర్ : పట్టణంలోని షాషాబ్ గుట్ట ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చెన్నంగారి మహేష్ దశదిన కార్యక్రమం వారి నివాసంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరై మహేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లంగారి భరత్ కుమార్, కార్పొరేటర్లు అవేజ్, తాహేర్, ఫక్రు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం నిరసన




**కొల్లాపూర్,(సమయం ప్రతినిధి):** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసులో తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కొల్లాపూర్ మండల కార్యదర్శి బి. శివ వర్మ, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం. తారాసింగ్ మాట్లాడుతూ, భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైందని పేర్కొంటూ, కేసులో చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే, కేసు విచారణ పారదర్శకంగా జరగాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో స్పష్టమైన వైఖరి అవలంబించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రామకృష్ణతో పాటు పార్టీ నాయకులు కార్తీక్, బాలయ్య, సత్తిరెడ్డి, కురుమయ్య, కిష్టయ్య, నాగశౌసి, శివశంకర్, రాజేష్, నరసింహ, సాయికృష్ణ, సాయిరాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీమంత్రి

**(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్)** మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం, నాణ్యత పరీక్షలను సమగ్రంగా పరిశీలించారు.రైతులకు సరిపడా వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు.వరి ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరుగుతోందని విమర్శించారు.తేమ శాతం (మాయిశ్చర్) పేరుతో రైతులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని అన్నారు.తరుగు పేరుతో ధాన్యాన్ని అధిక మొత్తంలో కోత విధిస్తున్నారని ఆరోపించారు.

ధాన్యం అమ్మిన తర్వాత రైతులకు చెల్లింపులు సమయానికి జరగడం లేదన్నారు.చెల్లింపుల ఆలస్యంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.కొంతమంది రైతులు పంటను కొనుగోలు కేంద్రాల వద్ద రోజులు గడిచినా తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారని తెలిపారు.వర్షాలు పడితే ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.రైతులకు న్యాయమైన ధర కల్పించి, సమయానికి చెల్లింపులు చేయాలని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.





# నేడు ఉపాధి కూలీల సమస్యలపై దేశవ్యాప్తంగా పని బంద్

**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు**

వనపర్తి : వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పుల్గార్ చర్ల గ్రామం ఉపాధి పని ప్రదేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు రైతు సంఘం మండల నాయకులు ఎం రాములు ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుని మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా కూలీలు తమ సమస్యలను తెలియజేస్తూ, గ్రామంలో 13 వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్న కూడా నేటికీ పేస్లిప్ ఇవ్వడం లేదని, గ్రామ పంచాయతీ వారు మంచినీళ్లు కూడా అందించడం లేదని, విపరీతంగా నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ, కూలి రేట్లు పెంచకపోవడం మూలంగా ప్రస్తుతం ఇస్తున్న 300 రూపాయలు ఏమాత్రం సరిపోవటం లేదని, 20 సంవత్సరాల నుంచి ప్రతి కుటుంబానికి వందరోజులు పని కల్పించడం ఇవి ఏమాత్రం కుటుంబానికి సరిపోవటం లేదని మరియు పనుల ప్రదేశానికి రావాలంటే బీపీ,షుగరు మరియు కాళ్ల నొప్పులతో ఉంటున్న కూలీలు నడవలేని స్థితిలో తీవ్ర అస్వస్థతకు గురి అవుతున్నామని కూలీలు తెలుపుతూ, తమకు 600 రూపాయల కూలి కావాలని రెండు వందల రోజుల పని దినాలు కావాలని పనుల ప్రదేశానికి రాకపోకల కోసం ఆటో సౌకర్యాలు కల్పించాలని పే స్లిప్పులు ఇవ్వాలని బకాయిగా ఉన్నటువంటి కూలీలను వెంటనే ఇవ్వాలని మహాత్మా గాంధీ పేరు మీదనే ఉపాధి పనులు కొనసాగాలని విభజి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని సంవత్సరం పొడుగునా ఉపాధి పనులు



కల్పించాలని, వ్యవసాయంలో యంత్రాలు రావడం, పంట పొలాల్లో కలుపు నివారణ మందులు రావడం వలన కూలీలకు పని దినాలు తగ్గిపోవడం జరిగింది. బట్టి తప్పక కూలి పని దినాలను 200 కు పెంచాలని తెలిపారు. ఈ డిమాండ్ల మీద దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలు మే 15న పనిబందు జరుగుతున్న సందర్భంలో ఫుల్గర్ చర్ల గ్రామంలో కూడా ఉపాధి పని బందును చేసి, గ్రామపంచాయతీ కార్యాల యం ముందు ధర్నా కార్యక్రమములో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు రైతు సంఘం మండల నాయకులు ఎం. రాములు కూలీలకు విజ్ఞప్తి చేశారు. ఇందులో కూలీలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# వాటర్ ట్యాంకర్స్ కు ఫుల్ డిమాండ్

హైదరాబాద్ : హైదరాబాద్‌పై సమ్మర్ ప్రభావంతో నీళ్ల ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. కొద్దిరోజులుగా నీళ్ల ట్యాంకర్ల కో?సం బుకింగ్స్ పెరిగాయి. నీళ్ల ట్యాంకర్లకు డిమాండ్ పెరగడంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పగటి వేళలో గృహ అవసరాల కోసం ట్యాంకర్లు పంపిస్తున్నారు. రాత్రి వేళల్లో కమర్షియల్ అవసరాల కోసం ట్యాంకర్లు సరఫరా చేస్తున్నారు. నగరంలోని పలుప్రాంతాల్లో కొద్ది రోజులుగా ట్యాంకర్ల బుకింగ్స్ భారీగా పెరిగాయని చెబుతున్నారు.హైదరాబాద్‌పై వేసవికాలం ఎఫెక్ట్ కనిపిస్తోంది.. బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో నీళ్లకు డిమాండ్ పెరిగింది. నగరంలో ట్యాంకర్లకు గిరాకీ పెరిగింది.. కొద్దిరోజులుగా బుకింగ్‌లు చాలా పెరిగాయి. ఈ క్రమంలో వాటర్ బోర్డు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పగటిపూట గృహ అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా నీళు ౣ సరఫరా చేస్తున్నారు. రాత్రి వేళల్లో కమర్షియల్ అవసరాల కోసం నీళ్లను సరఫరా చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నీళ్ల ట్యాంకర్లను పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం నగరంలో రోజుకు ఏకంగా 11వేలకు పైగా ట్రిప్పుల నీళ్లు డెలివరీ చేస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసుకున్న 24 గంటల్లోనే ట్యాంకర్ అందిస్తున్నారు. అంతేకాదు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు ట్యాంకర్లు ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు.

# ప్రజా పాలన-ప్రగతి కార్యక్రమాలు ఘనంగా ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో

# మెగా పేరెంట్-టీచర్ మీట్, హెల్త్ క్యాంప్, పూర్వ విద్యార్థుల సమ్మేళనం







**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక నాలుగో రోజు కార్యక్రమాలను మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మెగా పేరెంట్--టీచర్ మీటింగ్, వైద్య శిబిరం, కంటి పరీక్షలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌ను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ చైర్మన్ ఒబెదుల్ల కొత్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కళాశాల మహబూబ్‌నగర్‌కు తలమానికమని, ఇక్కడ చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో కొనసాగుతూ కళాశాల ప్రతిష్టను పెంచుతున్నారని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆధునిక నైపుణ్యాలు, కొత్త కోర్సులను అభ్యసించి భవిష్యత్తుకు సిద్ధం కావాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పీజీతో పాటు ఇతర విభాగాల్లో ఉన్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు వంద మందికి పైగా తల్లిదండ్రులు హాజరై కళాశాల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భవిష్యత్ అవకాశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహన్ మాట్లాడుతూ కళాశాలలో మౌలిక వసతులు, తరగతి గదులు మరింత మెరుగుపరిస్తే అడ్మిషన్లు పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఏఈడీపీ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థులకు మెరుగైన జాబ్ ప్లేస్‌మెంట్ అవకాశాలు ఉండటంతో డిగ్రీ పూర్తయ్యే సరికి ఉపాధి అవకాశాలు సులభంగా లభిస్తాయని వివరించారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ సేవలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొనగా వైద్యులు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు.పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్న పూర్వ విద్యార్థులు హాజరై తమ అనుభవాలను పంచుకుంటూ, కళాశాల తమ విజయాలకు బలమైన పునాది వేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, కన్వీనర్ డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, కోఆర్డినేటర్లు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, అధ్యాపకులు, డాక్టర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ బీచుపల్లి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి



అలంపూర్ : మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాజీ మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికి, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం మాజీ మంత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గారి వెంట పెబ్బేర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్,కర్రె స్వామి నాయకులు రాజశేఖర్ ఎల్లా రెడ్డి కౌన్సిలర్స్ శంకర్ నాయుడు మన్యం, శివ ప్రసాద్ రెడ్డి సాయి వడ్డె, రమేష్, అభిమానులు, కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అమరచింత : పట్టణ శివారులోని ఎన్ ఆర్ దాబా సమీపంలో నర్వ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కథలప్ప (48) ఆత్మకూరు వస్తున్నగా వెనుక వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టినట్లు, రోడ్డుపై పడక స్థానికులు గమనించి 108 వాహనం నందు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉపాధి కూలీలకు 600 రూపాయల కూలీ చెల్లించాలి


**అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్**



**(సమయం ప్రతినిధి ఆత్మకూరు):** ఆత్మకూరు మండలంలోని దేవరపల్లి, తిపుడంపల్లి గ్రామాలలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న పని ప్రదేశాలను గురువారం నాడు సందర్శించి వివరాలు సేకరించి పని ప్రదేశంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సరైన కూలీ లభించక సకాలంలో కూలి డబ్బులు రాక పనిలో పాల్గొనడం లేదని జాబ్ కార్డు ఉన్నవారినందరినీ పనిలో నిమగ్నం చేయాలని అన్నారు.ఉపాధి హామీని రక్షించుకోవడానికి ఉపాధి సిబ్బంది ప్రభుత్వాధి కారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని పనిలో కూలీలను భాగస్వామ్యం చేయాలని, ఈ పనిలో పాల్గొన్న కూలీలకు 600 రూపాయల కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వారం వారం కూలీ డబ్బులు చెల్లించాలని 200 రోజులు పని కల్పించాలని ప్రమాదాన్ని గురైన కూలీలకు వడదెబ్బ గాని పాము కాటు కానీ అనుకోని సంఘటనతో కూలీలు మరణిస్తే 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని వీరికి ఎలాంటి బీమా సౌకర్యం లేదని బీమా సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కూలీలు పుల్లన్న వెంకటేష్ సత్తమ్మ శిరీష కృష్ణయ్య తదితర కూలీలు పాల్గొన్నారు.

## వివాహ, నిఖా వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి





**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ, నిఖా వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర సాగర సంఘం మాజీ అధ్యక్షులు, దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామానికి చెందిన నర్సింహ సాగర్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండల కేంద్రం బీసీ కాలనీలో చాంద్ పాషా కుమార్తె నిఖా వేడుకల్లో పాల్గొన్నారు. భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త బుర్రాన్ కుటుంబ సభ్యుల నిఖా వేడుకకు హాజరయ్యారు. ఇక భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని నర్సింగపూర్ తండాలో మాజీ కౌన్సిలర్ వసంత గోపాల్ కుమారుడు వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం గుబ్బడి తండాలో తుఖ్య నాయక్ కుమారుడు వివాహానికి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## బెంగాల్ రాజకీయాల్లో నందిగ్రామ్ రెండో అంకం

కోల్ కత్తా : పశ్చిమ బెంగాల్ రాజకీయం ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సువేందు అధికారి అటు మమతా బెనర్జీ సొంత గడ్డ భవానీపూర్‌లోనూ, ఇటు తన కంచుకోట నందిగ్రామ్‌లోనూ ఘన విజయం సాధించి జెయింట్ కిల్లర్ గా నిలిచారు. అయితే, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు.. ఏదో ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉండటంతో, ఆయన భవానీపూర్‌ను అట్టి పెట్టుకుని నందిగ్రామ్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఇప్పుడు నందిగ్రామ్‌కు ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానం ఇప్పుడు మమతా బెనర్జీకి రాజకీయ పునర్వైభవం కోసం, మరో అగ్నిపరీక్ష కోసం వేచి చూస్తోంది.ఎమ్మెల్యేగా ఓడిపోయిన మమతా బెనర్జీకి, పార్టీని తిరిగి గాడిలో పెట్టాలంటే అసెంబ్లీలో అడుగుపెట్టడం అనివార్యం. ప్రస్తుతం ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఎంపీగా ఉన్నారు. అసెంబ్లీకి వెళ్లలేరు. దీదీ స్వయంగా సభలో ఉంటేనే టీఎంసీ శ్రేణుల్లో ఉత్సాహం పెరుగుతుంది. అయితే, నందిగ్రామ్ నుంచి పోటీ చేయడం ఆమెకు ఒక పెను సవాల్. 2021లో ముఖ్యమంత్రిగా ఉండి కూడా అక్కడ సువేందు చేతిలో ఓటమి పాలైన ఆమెకు, ఇప్పుడు అధికారం లేని స్థితిలో, విపక్ష నేతగా అక్కడికి వెళ్లడం అంటే కత్తి మీద సామే అని భావిస్తున్నారు.నందిగ్రామ్ అనేది కేవలం ఒక నియోజకవర్గం కాదు, అది బెంగాల్ పోరాట పటిమకు చిహ్నం. సువేందు అధికారి అక్కడ తన పట్టును నిరూపించుకున్నారు. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉండి, తన అభ్యర్థిని అక్కడ నిలబెడితే ప్రభుత్వం ఉన్న అడ్వాంటేజ్ బీజేపీకి అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ఈ తరుణంలో మమత అక్కడ పోటీ చేసి మళ్లీ ఓడిపోతే, ఆమె రాజకీయ భవిష్యత్తు , టీఎంసీ మనుగడ మరింత క్లిష్టంగా మారుతుంది. అందుకే ఆమె సేఫ్ సీటు కోసం చూస్తారా లేక నందిగ్రామ్ సవాల్‌ను స్వీకరిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. మమతా బెనర్జీ సహజంగానే పోరాట యోధురాలు. ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదల ఆమెలో ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. బీజేపీ 207 సీట్ల భారీ మెజారిటీతో అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ క్యాడర్ నైరాశ్యంలో ఉండటం ఆమెకు ప్రతికూలాంశాలు. ఒకవేళ ఆమె నందిగ్రామ్‌లో రిస్క్ చేయకూడదని భావిస్తే ఆమె పోటీ చేసే అవకాశం ఉండదు. సువేందు అధికారి తన వ్యూహాన్ని చాలా స్పష్టంగా అమలు చేస్తున్నారు. తాను నందిగ్రామ్‌ను వదులుకున్నప్పటికీ, అక్కడి ప్రజలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, తన వారసుడిని గెలిపించుకోవడం ద్వారా మమతకు మళ్లీ చుక్కలు చూపిస్తానని ఆయన బహిరంగంగానే సవాల్ విసురుతున్నారు. ఆరు నెలల్లో జరగబోయే ఈ ఉపఎన్నిక బెంగాల్ రాజకీయాల్లో కీలక పోరాటంగా మారబోతోంది. మమతా బెనర్జీ అసెంబ్లీలో అడుగుపెట్టకపోతే, బెంగాల్‌లో టీఎంసీ ప్రాభవం క్రమంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. నందిగ్రామ్ మరోసారి యుద్ధభూమిగా మారబోతోంది. మమతా బెనర్జీ తీసుకునే నిర్ణయం ఆమె పార్టీ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఆ బెంగాల్ అసెంబ్లీలో దీదీ గళం వినబడాలంటే ఆమె ఈ గండం గట్టెక్కక తప్పదు.

## అమెరికాలో 'శాండ్‌విచ్ జనరేషన్ నిరసనలు

న్యూఢిల్లీ : అమెరికాలో లక్షలాది మంది తీవ్రమైన ఆర్థిక, మానసిక, వృత్తి పరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఒకే సమయంలో వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటూ, మరోవైపు పిల్లల ఆలనాపాలనలో మునిగిపోవడంతో వారి జీవితాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. 'శాండ్‌విచ్ జనరేషన్'గా పిలుస్తున్న ఈ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల అమెరికా సెనేట్ కమిటీ ఆన్ ఏజింగ్ ప్రత్యేక విచారణ చేపట్టింది. వీరికి ఫెడరల్ ప్రభుత్వం నుంచి మరింత మద్దతు అవసరమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. సెనేట్ కమిటీ చైర్మన్ రిక్ స్కాట్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు 11 మిలియన్ల మంది అమెరికన్లు వృద్ధ తల్లిదండ్రులు, పిల్లల బాధ్యతలతో సతమతమవుతున్నారని తెలిపారు. వీరిలో ప్రతి ఐదుగురిలో ఒకరు తమ ఉద్యోగ వేళలు తగ్గించుకోవడం లేదా పూర్తిగా మానేయడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో వేతనం లేని ఈ సంరక్షణ విలువ ఏటా 600 బిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని ఆయన అంచనా వేశారు.ఈ విచారణలో సెనేటర్ ఆండీ కిమ్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. తన తండ్రికి అల్జీమర్స్ వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తాను కూడా 'శాండ్‌విచ్ జనరేషన్'లో చేరానని, ప్రస్తుతం ఆయన బాగోగులు చూసుకోవడానికి ఒక కేర్‌గివర్‌ను నియమించాల్సి వస్తోందని వివరించారు.ఫ్లోరిడాకు చెందిన మేగన్ మహేర్ అనే మహిళ మాట్లాడుతూ.. తన మొదటి బిడ్డ పుట్టిన కొన్ని వారాలకే తల్లికి క్యాన్సర్ అని తేలడంతో ఒకేసారి మాతృత్వం, కేర్‌గివర్ బాధ్యతలు మోయాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ బాధ్యతల కారణంగా తాను సంప్రదాయ ఉద్యోగాలు చేయలేక స్వయం ఉపాధిపై ఆధారపడాల్సి వచ్చిందని తెలిపారు.కేర్‌గివర్స్‌కు పన్ను మినహాయింపులు, వేతనంతో కూడిన సెలవులు, వారి సేవలకు సోషల్ సెక్యూరిటీ క్రెడిట్లు వంటివి అందించే విధానాలపై దృష్టి పెట్టాలని నిపుణులు, బాధితులు కాంగ్రెస్‌ను కోరారు.

# పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ నగరంలోని పిల్లల మర్రిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడినట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు కాగా, అందులో భాగంగా రూ.2.5 కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపన చేపట్టినట్లు చెప్పారు.

మయూరి పార్క్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్, వ్యూ పాయింట్లు, పర్యాటకుల కోసం తాత్కాలిక కాటేజీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఫారెస్ట్ ఏరియా పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు జరుగుతాయని తెలిపారు.

అదేవిధంగా కురుమూర్తి, మన్నెంకొండ, పిల్లల మర్రి వంటి



ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలను అనుసంధానిస్తూ టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## పిల్లల మర్రిలో రూ.2.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వచ్చే ఏడాది నిర్వహించనున్న కృష్ణ పుష్కరాలు దృష్ట్యా జిల్లాలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం సుమారు 150 పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి సమర్పించగా, వాటికి ఆమోదం లభించినట్లు వెల్లడించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో పనులు చేపడుతోందని, గత లోటుపాట్లను సరిదిద్దుతూ వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, జిల్లా పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం





**నాగర్ కర్నూల్ (సమయం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం బిజినపల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.... విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించే సాధనమని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని డిఇఓ వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాస్‌రూములు, ఆంగ్ల మాధ్యమ బోధన, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వంటి పథకాల ద్వారా విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని పిల్లలను ప్రతిరోజూ ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెరగడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, పిల్లల చదువుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. పిల్లలలో మొబైల్ ఫోన్ సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి, చదువుపై దృష్టి కేంద్రీకరించేలా తల్లిదండ్రులు మార్గనిర్దేశనం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రతిభను

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా కల్పిస్తున్నాం పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి, డీఈఓ రమేష్ కుమార్

గుర్తించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల విద్యా పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై తల్లిదండ్రులతో చర్చించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, హరిత వాతావరణం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఈఓ సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రధాన వీధుల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతులను విద్యా ప్రమాణాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నాగర్‌కర్నూల్, (సమయం ప్రతినిధి):** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ పురుషుల కళాశాల, మహరాజ్‌పేట్ (జడ్చర్ల)లో 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.వి. నిరంజన్‌రావు తెలిపారు. బి.ఏ., బి.కాం., బి.ఎస్సీ, బి.ఎస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లో 5వేల ర్యాంకు లోపు ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, డిజిటల్ క్లాసులు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ప్రాధాన్యతతో ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు 7659879703, 8474642335 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) బేగంపేట్/రామంతపూర్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి 1వ తరగతి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం వెల్లడించింది. 01 జూన్ 2019 నుంచి 31 మే 2020 మధ్య జన్మించిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొంది. గ్రామీణ ప్రాంత కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత కుటుంబాల ఆదాయం రూ.2 లక్షలలోపు ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం (రూమ్ నెం.105)లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులతో పాటు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఇతర సంబంధిత పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాలని సూచించారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆకస్మిక తనిఖీ





**నాగర్ కర్నూల్ (సమయం ప్రతినిధి):** జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం రాచాలపల్లి, రేవల్లి, గుడి గాని పల్లి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, తోకలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,ఉదయం ఏడు గంటలకే గ్రామాలకు చేరుకున్న అధికారులు గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, పనులు వేగంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి సరఫరా, సాంకేతిక సహాయం విషయంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులను శాశ్వత పరిష్కారంగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా డ్రైనేజ్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మిషన్ భగీరథ తాగునీటి సరఫరా వ్యవస్థను కూడా పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పైప్‌లైన్ వ్యవస్థను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రజాధనం వృథా కాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా గ్రామాల్లోకే వెళ్లి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు ఇళ్లు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడం ద్వారా గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, అధికారులు ప్రజలతో సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, పీడీ హౌసింగ్ సంగప్ప, డీపీవో శ్రీరాములు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఉరుకొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమాజంలో మార్పు రావాలంటే గ్రంథాలయాల అభివృద్ధి అత్యంత అవసరం

-ప్రతి ఇల్లు ఒక లైబ్రరీగా మారి జ్ఞాన సమాజం దిశగా సాగాలి
-రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
-తెలంగాణలోనే మొదటి డిజిటల్ లైబ్రరీ వనపర్తిలో ఏర్పాటు చేసుకున్నాం, వనపర్తి లో లైబ్రరీల అభివృద్ధికి ఎల్లప్పుడు సహకరిస్తా
-వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి
-విద్య అనేది ఎవరు దోచుకోలేని సంపద
-రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి





**వనపర్తి, సమయం ప్రతినిధి:** సమాజంలో మార్పు రావాలంటే గ్రంథాలయాల అభివృద్ధి అత్యంత అవసరమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయంలో కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై నూతన మొదటి అంతస్తును ప్రారంభించారు. కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు గ్రంథాలయ నూతన మొదటి అంతస్తును ప్రారంభించిన అనంతరం సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం అతిథులతో కలిసి కొత్త అంతస్తును పరిశీలించి, గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. డిజిటల్ లైబ్రరీతో పాటు గ్రంథాలయ ఆవరణను సందర్శించి అక్కడ కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే గ్రంథాలయాల అభివృద్ధి అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఇల్లు ఒక లైబ్రరీగా మారాలని, కుటుంబ ఖర్చుల్లో కొంత భాగాన్ని పుస్తకాల కొనుగోలుకు వెచ్చిస్తే జ్ఞాన సమాజ నిర్మాణానికి దోహదం అవుతుందని పేర్కొన్నారు. శాలువాలు, బొకేలకు ఖర్చు చేసే సంస్కృతికి స్వస్తి చెప్పి, ఆ డబ్బుతో పుస్తకాలు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో విలువైన పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతామని, శాలువాలు బొకేలకు వెచ్చించే ఖర్చును పుస్తకాలపై పెట్టి వాటిని డొనేషన్ ద్వారా గ్రంథాలయాలకు అందించే కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. సాంస్కృతిక శాఖ ద్వారా గ్రంథాలయ అభివృద్ధికి రూ.1 కోటి నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పుస్తకాల కొనుగోలుకు రూ.10 లక్షలు కేటాయిస్తామని వెల్లడించారు. వనపర్తి విద్యకు నిలయంగా పేరొందిందని, ఇక్కడ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. విద్యా, క్రీడా రంగాలకు అధికంగా నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రంథాలయ మొదటి అంతస్తును ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వనపర్తికి "చదువుల పర్తి"గా ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. గ్రంథాలయంలో అనేక ఆధునిక సౌకర్యాలు కల్పించామని, తెలంగాణలో తొలి డిజిటల్ లైబ్రరీని వనపర్తిలోనే ప్రారంభించామని పేర్కొన్నారు. వనపర్తి లో అన్ని రకాల ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయని, నవోదయ విద్యాలయాన్ని కూడా తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మెస్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలు పెంచామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తిలోనే చదువుకున్నారని, విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తున్నారని అన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖల నుంచి చెరో కోటి రూపాయల నిధులు కేటాయించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. అలాగే లైబ్రరీ వద్ద హైమాస్ట్ లైట్లు తదితర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వనపర్తి చరిత్రను ప్రస్ఫుటించే విధంగా లైబ్రరీలను అభివృద్ధి చేసుకుందామని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ యువత అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖాళీ సమయంలో పుస్తకాలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని, గ్రంథాలయంలో అవసరమైన సౌకర్యాల కల్పనకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఫర్నిచర్ ఏర్పాటుకు కూడా సహకారం అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ వనపర్తి అంటేనే "విద్యపర్తి"గా ప్రసిద్ధి చెందిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని అనేక మంది విద్యార్థులు వనపర్తికి వచ్చి చదువుకునేవారని గుర్తుచేశారు. ఇంత మంచి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. డబ్బును దోచుకోవచ్చు కానీ చదువును ఎవరూ దోచుకోలేరని అన్నారు. గ్రంథాలయానికి మంచి పుస్తకాలను తాను డొనేట్ చేస్తానని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వనపర్తిలో గ్రంథాలయ సంస్థ మొదటి అంతస్తు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పబ్లిక్ రీడింగ్ రూమ్ లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో డైనింగ్ హాల్ సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని మంత్రిని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ లైబ్రరీకి రోజు 300 నుంచి 400 మంది విద్యార్థులు చదువుకోడానికి వస్తుంటారని వారికి సౌకర్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అదేవిధంగా కొత్త మండలాల్లో కూడా లైబ్రరీలో ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాద్, వనపర్తి మున్సిపల్ చైర్పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్



**(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) :** నియోజకవర్గం, హన్వాడ మండలంలోని నాగంబాయి తాండా సర్పంచ్ లోకేష్ నాయక్ ఆహ్వానం మేరకు వారి కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులు చిరంజీవి ప్రవీణ్, చిరంజీవి గంగోత్రి లను ఆశీర్వదించి వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే తో పాటు ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ నాయకులు చెన్నయ్య, యాదిరెడ్డి, టాంకర కృష్ణయ్య యాదవ్, షబ్బీర్ హుస్సేన్, సర్పంచులు ఇస్నాతి సుధాకర్,కె.శ్రీను నాయక్, సత్యం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ప్రభుత్వ విప్



**(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్):** రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సవరమ్మ గుడి నుంచి చిన్న పల్గు పొలం వరకు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న మట్టి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సల్లోనిపల్లి – పల్లుతాండా గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేస్తున్న ఈ మట్టి రోడ్డు గ్రామ ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలిగించడమే కాకుండా, రోడ్డు ప్రక్కన ఉన్న రైతులకు కూడా ఎంతో మేలు చేకూరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కార్యనిర్వహక అధ్యక్షులు చెన్నయ్య,, యాదిరెడ్డి , టంకర కృష్ణయ్య యాదవ్, షబ్బీర్ హుస్సేన్, సర్పంచులు ఇస్నాతి సుధాకర్, కె. శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వీబిజి రామ్ కొత్త చట్టం రద్దు కై 15న దేశ వ్యాప్తంగా జరుగు సమ్మె ను విజయవంతం చేయండి

## తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్. అజయ్. పిలుపు

అమరచింత : గురువారం నాడు అమరచింత మండలం లోని ప్రియదర్శినిఏక్స్ రోడ్ గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతు.

1. రెండు పూటల ఐ ఫోటో క్యాప్చర్ విధానం రద్దు చేయాలని.

2. పే స్లిప్పులు ప్రతివారం ఇవ్వాలని.

3. ఉపాధి పని జరిగే ప్రదేశం దగ్గర మంచినీరు మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని.

4. పెండింగ్ లో ఉన్న కూలీ డబ్బులు వెంటనే వారి అకౌంట్లో జమ చేయాలని.

5. పెరిగిన ధరలకు అనుగుణంగా 600రూ కూలి పెంచి ఇవ్వాలని.

6. పనిముట్లు గడ్డపార పార.కొడవలి గొడ్డళ్లు సరఫరా చేయాలని.

7. 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పిస్తూ జాబ్ కార్డులు ఇవ్వాలని.

8. భూమిలేని ఉపాధి కూలీలకు 12000 రూ స్కీము అమలు చేయాలని.

9. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ లకు కనీసవేతనం నెలకు 26000ఇవ్వాలని డీమాండ్



చెశారు.

15 మే శుక్రవారం రోజు రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా గ్రామీణ బంధు ( సమ్మె)లో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మె ను విజయవంతం చేయాలనీ పిలుపు నీచ్చారు. ఈ కార్యక్రమలోకుర్వ ఆంజనేయులు భీమ్ రెడ్డి.సులోచనమ్మ. సావిత్రి. జయమ్మ రాకేష్ వి. ఆంజనేయులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# బండి చుట్టూ రాజకీయం...

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వ్యక్తిగత స్థాయికి చేరుకున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు కేవలం ఒక నేరపూరిత దర్యాప్తుగా మిగలకుండా, రాష్ట్రంలో రాజకీయ సెగలు పుట్టిస్తోంది. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి వంటి ప్రధాన ప్రాంతాల్లో బండి భగీరథ్ పరారీ అంటూ వెలిసిన పోస్టర్లు ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాయి. అసలు ఈ పోస్టర్లు ఎవరు వేశారు? దీని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి? అన్నది పక్కన పెడితే, ప్రత్యర్థిని దెబ్బతీయడానికి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.ఈ వ్యవహారం రెండు భిన్నమైన కథనాల మధ్య నలుగుతోంది. ఒక వైపు, ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిందని, ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని ప్రాసిక్యూషన్ చెబుతోంది. మరోవైపు, ఇది పక్కాగా ప్లాన్ చేసిన హనీ ట్రాప్ అని, రూ. 5 కోట్ల వరకు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేశారని భగీరథ్ తరపున కౌంటర్ ఫిర్యాదు నమోదైంది. చట్టం తన పని తాను చేసుకుపోవాల్సి ఉండగా, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ట్రోలింగ్ ఈ కేసులో అసలు బాధితులు ఎవరో తేల్చలేనంత గందరగోళాన్ని సృష్టిస్తోంది.సాధారణంగా ఏదైనా కేసు నమోదైనప్పుడు దర్యాప్తుకు సహకరించాల్సిన బాధ్యత నిందితులపై ఉంటుంది. అయితే, బుధవారం సిట్ విచారణకు భగీరథ్ హాజరుకాలేదు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ పూర్తయిన తర్వాత వచ్చేలా రెండు రోజుల తరవాత వస్తానని సమాచారం పంపారు. బండి సంజయ్ రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే తన కుమారుడిని బలి చేస్తున్నారని, ఇది తనపై జరుగుతున్న పొలిటికల్ హిట్ జాబ్ అని ఆరోపిస్తున్నారు. అధికార పక్షం మాత్రం.. నేరం చేసింది ఎవరైనా చట్టం ముందు సమానమేనని, బాధితురాలికి న్యాయం జరగాల్సిందేనని పట్టుబడుతోంది. మరో వైపు బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలంటున్నారు. ఈ రాజకీయ యుద్ధంలో బాధితురాలి కుటుంబానికే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకునే క్రమంలో, బాధితురాలి గుర్తింపును గానీ, ఆమె మానసిక స్థితిని గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు ఈ సమస్యను పరిష్కరించడానికి వివాహం వంటి వింత సలహాలు ఇవ్వడం, దానికి టీపీసీసీ ఖండన తెలపడం వంటివి చూస్తుంటే.. ఈ అంశం ఎంతటి అయోమయానికి గురైందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో నేతలను వ్యక్తిగతంగా దెబ్బతీయడానికి వారి పిల్లలను, కుటుంబ సభ్యులను వాడుకునే సంస్కృతి పెరిగిపోవడం ఆందోళనకరమన్న అభిప్రాయం వినిపిస్తోంది. అది భగీరథ్ అయినా, మరెవరైనా.. నేరం నిరూపితమైతే చట్టపరమైన శిక్ష అనుభవించాలి. కానీ, దర్యాప్తు పూర్తికాకముందే పోస్టర్లతో వేధించడం , రాజకీయ కుట్రలంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడంపై విమర్శలు వస్తున్నాయి.



# మగాళ్లూ! మౌనం వీడండి

**శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మానవాళి ప్రగతి సాధించినా... మహిళలపట్ల పురుషుల దృష్టికోణంలో వచ్చిన మార్పు అంతంత మాత్రమే. అందుకు జాతీయ నేరగణాంకాల పట్టికలోని అంకెలే నిదర్శనం. మహిళాభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారిన వేధింపుల పర్వానికి ఫుల్‌స్టాప్ పెట్టాలన్న సంకల్పంతో తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీపీ చారు సిన్హా... 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలకరించింది.**

"మహిళల భద్రత కేవలం పోలీసుల కర్తవ్యమే కాదు... సమాజానికి కూడా అంతకుమించిన బాధ్యత ఉంది. ఇల్లు, పని ప్రదేశం, వీధులు, సామాజిక మాధ్యమాలు, బస్సులు, రైళ్లు... అంతటా మహిళల పట్ల అమర్యాద, అవమానాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. కొందరు మగవాళ్లు వంకరచూపులతో ఇబ్బందిపెడితే, ఇంకొందరు మాటలతో వేధిస్తారు. మరికొందరు చేష్టలతో హింసిస్తారు. ఇంటర్నెట్ వాడకం పెరిగిన తర్వాత మహిళలపై వేధింపులు రకరకాలుగా కొత్తరూపాలు తీసుకున్నాయి. ఒకడు... తను లైంగిక దాడికి ఎలా ఒడిగడతాడో కళ్లకుకట్టినట్టుగా వివరించి, బెదిరిస్తూ తీసిన వీడియోను ఒక అమ్మాయికి పంపించాడు. అది విన్న నా మనసు కకావికలమైంది. 'అబ్బాయిల మానసిక స్థితి ఇంత దారుణంగా తయారయిందా?' అని నిర్ఘాంతపోయాను. లింగవివక్ష పూర్వక వ్యాఖ్యలు, ఈవ్‌టీజింగ్, ఆన్‌లైన్ వేధింపుల సంగతి అయితే చెప్పనవసరం లేదు. ఇవన్నీ సర్వసాధారణమన్నంతగా సమాజంలోనూ అభిప్రాయం స్థిరపడిపోయింది. మాటలతో వేధించేవాడిని ఇవాళ నిలువరించకపోతే రేపు వాడే యాసిడ్ బాటిల్ పట్టుకొని తిరుగుతాడు. కనిపించిన ప్రతి అమ్మాయి పట్ల వికారంగా ప్రవర్తిస్తాడు. మరి పురుషుల్లోని ఈ మితిమీరినతనాన్ని అడ్డుకునేదెవరు? దాన్ని మొగ్గలోనే తుంచేదెవ్వరు? ఆ బాధ్యత కూడా బాధితురాలిమీదే నెడదామా? కాదు... ఆమెకు తోడుగా నిలవాల్సింది మనమే! బాధితురాలి పక్షాన వకాల్తాపుచ్చుకొని, ఆకతాయిలకు తగిన బుద్ధి చెప్పాల్సిన కనీస బాధ్యత పురుషులదే! మగాళ్లూ! మౌనం వీడండి. మహిళలపై వేధింపుల పర్వాన్ని అడ్డుకోండి. ఇదే పిలుపుతో 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్ మొదలుపెట్టాం.

### విశ్వవిద్యాలయాల్లోకి...

ఏడాది పాటు కొనసాగే 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్‌లో నెలకొక ప్రత్యేక థీమ్‌ను ఎంపిక చేసుకొని ప్రచారం నిర్వహిస్తున్నాం. సెక్సిస్ట్ జోక్స్, ఈవ్‌టీజింగ్ లాంటి వేధింపుల సంస్కృతిని చట్టాలు, శిక్షలకన్నా పురుషుల దృక్పథాన్ని మార్చడం ద్వారానే నిర్మూలించగలం. దానికోసం అవగాహన కల్పించే వీడియోలు, లఘుచిత్రాలు రూపొందిస్తున్నాం. వివిధ రంగాలవారితో చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నాం. జూలైలో తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలకూ ఈ క్యాంపెయిన్‌ను తీసుకు వెళ్లడానికి అనుగుణమైన ప్రణాళికలు తయారుచేశాం. కొందరు ప్రొఫెసర్లతో కమిటీలు ఏర్పాటుచేసి... రకరకాల అంశాలపై ప్యానల్ డిస్కషన్స్ పెడతాం. వీడియోలనూ ప్రదర్శిస్తాం. ఆ క్రమంలో ఏది సరైన ప్రవర్తన? ఏది కాదన్న విషయాన్ని అర్థంచేసుకొనే అవకాశాన్ని అబ్బాయిలకే వదిలేస్తాం. తద్వారా వాళ్లలో జెండర్ సెన్సిటివిటీని పెంపొందించాలన్నది మా ఉద్దేశం. ఉదాహరణకు తమకు నచ్చిన దుస్తులు ధరించే అబ్బాయిలు... అమ్మాయిల వస్త్రధారణ మీద వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సరైనది? నచ్చిన దుస్తులు ధరించే స్వేచ్ఛ అమ్మాయిలకు లేదా? అసలు మహిళలు, యువతులు ఎలా నడుచుకోవాలి? ఎలాంటి దుస్తులు ధరించాలి? లాంటి విషయాల్లో తీర్పులు ఇచ్చే అధికారం ఎవరిచ్చారు? ఇటువంటి సున్నితమైన అంశాలపై సునిశితమైన చర్చను ఈ క్యాంపెయిన్ ద్వారా పురుషుల ముందు ఉంచుతున్నాం.

### కార్పొరేట్‌లో కష్టాలు...

పురుషులు గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే... ఒక యువతి లేదా మహిళ మీతో కలిసి కాఫీ తాగడానికి వచ్చినంత మాత్రాన, లేదా మీతో స్నేహపూర్వకంగా మెలిగినంత మాత్రాన ఆమె మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టు కాదు. దురదృష్టవశాత్తూ అమ్మాయిలపట్ల అబ్బాయిల సత్ప్రవర్తనతో మెలిగే పద్ధతులను మన పాఠశాలలు, విద్యాలయాలు, కుటుంబం, సమాజం... ఇవేవీ నేర్పించలేకపోతున్నాయి. వారిని సినిమాలు బాగా ప్రభావితం చేస్తున్నాయి. సున్నితత్వాన్ని పెంపొందించే సినిమాలు, వెబ్‌సిర?సలు, సాహిత్యం విరివిగా రావాలి. అందుకే సినీరంగ ప్రముఖులను కూడా ఈ క్యాంపెయిన్‌లో భాగస్వామ్యం చేస్తున్నాం. కార్పొరేట్ కంపెనీల్లో మగ టీమ్‌లీడర్లు, మేనేజర్ల వేధింపులు తట్టుకోలేక ఉద్యోగాలు వదిలేస్తున్న ఉద్యోగినులు ఎంతోమంది. ఒకవేళ ఫిర్యాదుచేస్తే మరొక ఆఫీసులో ఉద్యోగం దొరకదన్న భయం చాలామంది మహిళలది. లేదంటే... ఆమె మీద ప్రాబ్లమేటిక్ అనో లేదా పని సరిగ్గా చేయరనో రకరకాల ముద్రలువేసి దుష్ప్రచారం చేస్తుంటారు. హైదరాబాద్‌లోని చాలా కార్పొరేట్ కంపెనీల్లో ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు లేవు. ఆఫీసులో ఎవరైనా ఒక తెంపరి... ఉద్యోగినుల మీద ప్రత్యక్షంగా లేదా పరోక్షంగానైనా సెక్సిస్ట్ జోక్స్ వేయడం, పలుచనచేసి మాట్లాడడం లాంటివి చేసినప్పుడు నిర్మొహమాటంగా 'అది సరికాదు' అని చెప్పాల్సింది పురుషులే!.

### అలాంటి వారిని వదిలేది లేదు

ఆన్‌లైన్‌లో మహిళలపై వేధింపులు ఈ మధ్యకాలంలో పెరిగాయి. ఏదైనా సామాజిక అంశంపై మహిళలు అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన సందర్భంలో అవి మరింత మీరుతున్నాయి. బూతులు తిట్టడం సర్వ సాధారణమైంది. ఇలాగే తమ అభిప్రాయాలను చెబుతూ వీడియోలు షేర్ చేసిన ఇద్దరు మహిళా జర్నలిస్టులను సోషల్ మీడియాలో కొందరు పోకిరీలు వేధించిన ఘటనలు మా దృష్టికి వచ్చాయి. కేవలం బూతులతో దాడిచేయడమే కాదు, వారి ఫొటోలు మార్ఫ్‌చేసి మరీ షేర్ చేయడం లాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడ్డారు. అలాంటి వారిని గుర్తించి తగిన శిక్షపడేలా చేశాం. బూతులు, తిట్లతో వేధిస్తామంటే పోలీసులు ఓ కంట కనిపెడుతున్నారన్న సంగతి ఆన్‌లైన్ పోకిరీలు గుర్తుంచుకోవాలి.

### దయచేసి స్పందించండి!

కొన్నాళ్ల కిందట రాజస్థాన్‌లో నేను గమనించిన ఒక ఘటన గురించి కచ్చితంగా చెప్పాలి. అక్కడ ఒక పెద్ద హోటల్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లో కొందరు అమ్మాయిలు ఈత కొడుతున్నారు. ఆ ఈతకొలను చుట్టూ మగ వెయిటర్లంతా నిలబడి సినిమాలా చూస్తున్నారు. హోటల్ యాజమాన్యం, ఆ అమ్మాయిలు, చుట్టుపక్కల వ్యక్తుల్లో ఒక్కరుకూడా కనీసం ఆ వెయిటర్లను అదిలించిన పాపాన పోలేదు. ప్రతిచోటా ఇలాంటి అపసవ్య ధోరణులే. వాటన్నింటినీ చూస్తూ ఊరుకోవడమేనా! నోరు మెదిపాలి కదా! 'ఇది తప్పు' అని చెప్పాలి కదా! అమ్మాయిల తీరు కూడా మారాలి. బస్ట్?పలో ఆకతాయిలు వేధిస్తుంటే మరొక బస్సు రూట్‌కు వెళ్లడం, జీన్స్ ధరించావని కాలేజీలో ఎవడో కామెంట్ చేస్తే, ఇష్టమైన ఆ డ్రెస్‌కు బదులు సల్వార్ కమీజ్‌లోకి మారడం, వీ?ధిలో వెళ్లేప్పుడు ఈవ్‌టీజింగ్ ఎదురైతే, మౌనంగా తలవంచుకొని వెళ్లడం కాదు... పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అలాంటి విపత్కాలంలో పురుషులు మహిళలకు తోడుగా నిలవాలి."

### జెండర్ కన్వర్జేషన్స్‌తో మార్పు...

నేను సీఆర్పీఎఫ్ కశ్మీరు సెక్టార్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ)గా పనిచేస్తున్న సమయంలో 28వేల మంది పురుషులతో 'జెండర్ కన్వర్జేషన్స్' కార్యక్రమం నిర్వహించాం. ఇంటికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించే వారందరిలో ఆ ప్రోగ్రామ్ ద్వారా అనూహ్యమైన మార్పులు తీసుకురాగలిగాం. అది వారి వ్యక్తిగత, కుటుంబ జీవితాల మీదా సానుకూల ప్రభావం చూపింది. డిగ్రీ చదువుతున్న తన కుమార్తెకు వెంటనే పెళ్లి చేయాలనుకున్న ఓ తండ్రితో మేము మాట్లాడిన తర్వాత... అమ్మాయి చదువుకొని, మంచి ఉద్యోగంలో చేరిన తర్వాతే, అదీ ఆమె ఇష్టప్రకారం సంబంధాలు చూడాలని నిశ్చయించుకున్నాడు. వెయ్యిమందికిపైగా సీఆర్పీఎఫ్ సిబ్బంది సెలవులకు ఇంటికి వెళ్లినప్పుడు తమ భార్యలకు స్కూటర్ నేర్పించారు. చర్చలు, సంభాషణల ద్వారా దృక్పథాన్ని మార్చవచ్చనడానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ. 'స్టాండ్‌విత్ హర్' క్యాంపెయిన్ ద్వారా ఇలాంటి సానుకూల ఫలితాలు కచ్చితంగా వస్తాయి.

# హైకోర్టు నిర్మాణంలో అవినీతి మరకలు...

హైదరాబాద్ : హైకోర్టు భవనాల నిర్మాణంలో అవినీతి చెద లు కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టు భవ న సముదాయం, న్యాయమూర్తుల నివాసాల సముదాయాల నిర్మాణాన్ని చేపట్టింది. అయి తే హైకోర్టు భవన నిర్మాణం పనుల్లో నాణ్యతాలోపం, అంచనాలను భారీగా పెంచేలా.. పలు సాంకేతిక అంశాలను తెరపైకి తీసుకొచ్చారు.ఇందులో భాగంగా హైకోర్టు నిర్మా ణం చేపడుతున్న ప్రాంతంలోని మట్టి భారా న్ని మోసే సామర్థ్యం తక్కువగా ఉందని (మెత్తగా ఉందని) రికార్డులను తారుమారు చేసి.. అదనంగా లోతుగా తవ్వాలని, అలాగే అదనంగా కాంక్రీట్ పనులు, పిల్లర్లను వేయాల్సి ఉంటుందనేలా కొత్త పథకాన్ని తెరపైకి తీసుకువచ్చారు. దీంతో సెల్లార్లకు సంబంధించిన వ్యయం సుమారు 280 శాతం పెరిగిందని, మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో సుమా రు 200 కోట్ల వరకు పెరిగిందని తెలుస్తోంది.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందుకు రాజేంద్రనగర్‌లో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆనుకుని సుమారు 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. నూతన హైకోర్టు నిర్మాణ భవన సముదాయాల నిర్మాణాన్ని చేపట్టేందుకు రూ. 2,583 కోట్ల వ్యయం అంచనాల తో పరిపాలనా అనుమతులను 2024 డిసెంబర్‌లో ఇచ్చారు. ఇందులో ప్రధానమైన కోర్టు భవనం, న్యాయమూర్తుల నివాస సముదాయం, న్యాయవాదులు, కక్షిదారుల కోసం.. ఇలా అన్ని రకాల వసతులతో నిర్మించే భవనానికి రూ. 1,443.73 కోట్లతో (ఈసీవీ–ఎస్టిమేటెడ్ కాంట్రాక్ట్ వాల్యూ) టెండర్లు పిలిచారు. అయితే సు మారు 4.95 శాతం ఎక్కువకు కోట్‌చేసిన డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రై.లి. అనే సంస్థ ఈ టెండర్‌ను రూ. 1,515 కోట్లకు దక్కించుకుందిమరో రూ. 603 కోట్లను హైకోర్టులో కావాల్సిన ఫర్నిచర్, ఇంటీరియర్, ఇతర వస్తుసామాగ్రిని ఏర్పాటు చేయడానికి కేటాయించారు. మొత్తం 36.52 లక్షల చదరపు అడుగుల మేర నిర్మాణ పనులను చేపట్టారు. జోన్–1లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు 3, అడ్వొకేట్స్ బ్లాకులు 3, పబ్లిక్ వసతులు, సౌకర్యాల బ్లాక్, పబ్లిక పార్కింగ్, అడ్వొకేట్ పార్కింగ్, బార్ కౌన్సిల్‌ను నిర్మించనున్నారు.అలాగే ప్రధాన కోర్టు భవనంలో మొత్తం 51 కోర్ట్ హాళ్లు ఉంటాయి. వీటి మొత్తం విస్తీర్ణం 6.52 లక్షల చదరపు అడుగులు. ఇక జోన్–2లో హైకోర్టు చీఫ్ జస్టిస్ నివాసం, సచివాలయం, అలాగే మరో 41 న్యాయమూర్తుల బంగాళాలు, క్లబ్‌హౌజ్, ఆడిటోరియం, సెంట్రల్ రికార్డ్ రూం తది తర నిర్మాణాలు ఉండనున్నాయి. వీటికి అదనంగా జడ్జీల పార్కింగ్‌లను కూడా ఏర్పాటుచేస్తారు.వాస్తవానికి మట్టి బరువుమోసే సామర్థ్యాన్ని తగ్గించి చూపడంతో.. అదనపు పనులు చేపట్టే అవకాశం చిక్కింది. దీనివల్ల అదనంగా లాభం కలుగుతుంది. అలాగే.. చేసే పనుల్లోనూ నాణ్యత లేకుండా, సాంకేతిక అంశాలకు, డ్రాయింగ్ లకు విరుద్ధంగా పనులు చేస్తుండటంతో.. భవిష్యత్తులో ప్రమాదాలను ఎదుర్కొవాలి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టరు కేవలం తమకు లాభం కలగాలనే ఉద్దేశంతో పునాది, బేస్ నిర్మాణంలో వాడాల్సినంత స్టీల్‌ను వాడటంలేదని తెలుస్తుంది.స్టీల్ సపోర్ట్ లేకుండానే.. రీఎన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్(ఆర్‌సీసీ) పనులు చేస్తున్నట్టుగా తెలుస్తుంది. అలాగే పద్ధతి లేకుండా బేస్ కాంక్రీట్ పనులు చేస్తున్నట్టుగా నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కన్సల్టెంట్ సంస్థకూడా గుర్తించింది. డ్రాయింగ్‌ల ప్రకారం కాకుండా.. ఇష్టారాజ్యంగా స్టీల్‌ను వాడుతున్నారు. షట్లర్ ప్లేట్లు సరైనవి వాడకపోవడం వల్ల కాంక్రీట్ వేసిన తరువాత ఉబ్బిపోయి పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఇలా కాంట్రాక్టరు తన ఇష్టారాజ్యంగా నిర్మాణం పనులు చేపడుతున్నట్టుగా అధికారులు కూడా గుర్తించినట్టు సమాచారం. రాష్ట్ర హైకోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి సంబంధించి టీం వన్ ఇండియా ప్రై.లి. అనే ఇంజనీరింగు సంస్థను కన్సల్టెంట్‌గా నియమించుకున్నారు. ఈ కన్సల్టెంట్ సంస్థ.. హైకోర్టు నిర్మాణాలకు సంబంధించి సాంకేతిక అంశాలను పరిశీలిస్తుంది. అలాగే ?రడ్రాయింగ్‌లు, డిజైన్లను రూపొందించి, వాటికి అనుమతి తీసుకుని వాటి ప్రకారం నిర్మాణ పనులను చేపట్టేలా చూస్తుంది.అయితే ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి సదరు టీం వన్ ఇండి యా ప్రై.లి. సంస్థ ప్రతినిధులతో.. కాంట్రాక్టు సంస్థ సరిగా వ్యవహరించడం లేదని, సహకరించడం లేదని పేర్కొంటూ.. దీనితోపాటు.. పలు సాంకేతిక అంశాలను పేర్కొంటూ.. 2025 డిసెంబర్ 17న సదరు కన్సల్టెంట్ సంస్థ హైకోర్టు బిల్డింగ్ కమిటీకి ఏకంగా లేఖ రాసింది.

## చైర్మన్ బాధ్యతల స్వీకరించిన శ్రీమతి సరిత



గద్వాల : తెలంగాణ రాష్ట్ర గొర్రెలు & మేకల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గద్వాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ వారిని శాలువాతో సత్కరించే శుభాకాంక్షలు తెలియ జేశారు. వీరి వెంట జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ నాయకులు అలంపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియపరిచారు.

## దేశంలో వేల కోట్ల లీటర్ల పెట్రోల్-డీజిల్ వాడకం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ టీవీలో హైదరాబాద్ పర్యటన సందర్భంగా దేశ ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. అందులో ఇంధన పొదుపు ఒకటి. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన వినియోగం తగ్గించాలని సూచించారు. వర్క్ ఫ్రం హోం చేయాలన్నారు. ప్రధానమంత్రి పిలుపునిచ్చిన నేపథ్యంలో, తన కాన్వాయ్‌లో ఉపయోగించే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ఆదేశించారు. ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లుగా, ఇది సాధారణ పెట్రోల్–డీజిల్ వాహనాలను తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాడకాన్ని పెంచడానికి దిశానిర్దేశం. భారతదేశంలో వార్షికంగా 2 వేల కోట్ల లీటర్ల పెట్రోల్–డీజిల్ వాడకం జరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి చర్యలు లక్షలాది కోట్ల రూపాయల ఆదాను తీసుకొస్తాయని నిపుణులు అంచనా. పొదుపు తన నుంచే మొదలు పెట్టాలని మోడీ కీలక ఆదేశాలు ఇచ్చారు.

# Cinema




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో ఓ క్రేజీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో ఈ చిత్రం నుంచి ఏ చిన్న అప్ డేట్ వచ్చినా క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా గ్లింప్స్ గురించి ఓ క్రేజీ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. గతంలో చిత్ర యూనిట్ ప్రకటించినట్లుగా, ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ను అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారట. దీంతో మే 20న నందమూరి అభిమానులకు అసలైన 'మాస్ ట్రీట్' లభించనుందని సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. అయితే నందమూరి అభిమానులు మే 20 వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, మే 19 అర్ధరాత్రికే ఈ సాలిడ్ గ్లింప్స్‌ను వదిలేందుకు ప్రశాంత్ నీల్ అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారట. అభిమానుల్లో ఉన్న ఉత్కంఠను దృష్టిలో ఉంచుకుని, పుట్టినరోజు ముందే ఈ కానుకను అందించాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో సరికొత్త ప్రపంచాలను సృష్టించిన నీల్, ఇప్పుడు తారక్ కోసం ఎలాంటి ఊహాతీతమైన లోకాన్ని సెట్ చేశారో చూడాలని యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ గ్లింప్స్ దాదాపు మూడు నిమిషాల పాటు ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈ అప్‌డేట్‌తో సోషల్ మీడియాలో ఒక్కసారిగా సందడి పెరిగింది. ముఖ్యంగా మే 18న రామ్ చరణ్ 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటం, ఆ మరుసటి రోజే ఎన్టీఆర్ మూవీ గ్లింప్స్ రానుండటంతో టాలీవుడ్‌లో మెగా-నందమూరి ఫ్యాన్స్ హంగామా పీక్స్‌కు చేరుకుంది. వరుసగా ఇద్దరు స్టార్ హీరోల అప్‌డేట్స్ వస్తుండటంతో యూట్యూబ్ రికార్డులు తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




నందమూరి నటసింహం బాలకృష్ణ , మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఒక భారీ చిత్రం తెరకెక్కుతున్న సంగతి మనందరికీ ఎరుకే. ఇప్పటికే ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. బాలయ్య, సముద్రఖని వంటి కీలక నటుల మధ్య ప్రధాన సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం.

ప్రస్తుతం ఈ సినిమా యూనిట్ ఒక ప్రత్యేకమైన ఐటెం సాంగ్ చిత్రీకరణలో బిజీగా ఉంది. సినిమా సెట్స్ నుంచి సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్ షేర్ చేసిన ఒక ఫోటో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఇది చూస్తుంటే ఈ సినిమాలో విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండబోతున్నాయని అర్థమవుతోంది. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా థమన్ ఈసారి ఎలాంటి మ్యూజిక్ ఇచ్చారో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వృద్ధి సినిమాస్ వారు ఎక్కడా రాజీ పడకుండా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలయ్య పుట్టినరోజు కానుకగా ఈ సినిమా టైటిల్‌తో పాటు ఒక అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేయబోతున్నారట. గోపీచంద్ మలినేని మార్క్ మాస్ ఎలివేషన్లు, అలాగే ఎస్.ఎస్. థమన్ ఇచ్చే పవర్‌ఫుల్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో ఈ గ్లింప్స్ సోషల్ మీడియాను షేక్ చేయడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. 'భగవంత్ కేసరి' వంటి సక్సెస్ ఫుల్ సినిమా తర్వాత మరోసారి వీరిద్దరూ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. దీనితో పాటు మలయాళ బ్యూటీ హనీరోజ్ కూడా ఈ సినిమాలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో నటీనటుల ఎంపిక విషయంలోనే సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండటం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. బాలయ్య, థమన్ కాంబినేషన్‌లో ఇప్పటివరకు వచ్చిన అఖండ, వీరసింహారెడ్డి, డాకు మహారాజ్, భగవంత్ కేసరి, అఖండ-2 వంటి సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఇప్పుడు ఈ చిత్రానికి కూడా థమన్ పనిచేస్తుండటంతో, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటల విషయంలో మరోసారి మ్యాజిక్ రిపీట్ అవుతుందని అంతా భావిస్తున్నారు. బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో గతంలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు అదే కాంబినేషన్ మళ్ళీ రిపీట్ అవుతుండటంతో నందమూరి అభిమానులు ఈ సినిమాపై గట్టి నమ్మకంతో ఉన్నారు. ఒక హిట్ కాంబినేషన్ తిరిగి రావడం ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. మరి ఈ సినిమాతో బాలయ్య ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తారో చూడాలంటే మూవీ విడుదల వరకు ఎదురుచూడక తప్పదు.




రెండు తెలుగు రాష్ట్రాలలో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పర్సంటేజ్ విధానం అమలు చేయాలన్న డిమాండ్ మరోసారి తెలుగు చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. ఎగ్జిబిటర్స్, నిర్మాతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ముదిరి పాకాన పడుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ఎగ్జిబిటర్స్ సమావేశమై ఇకపై పర్సంటేజీ సిస్టంపైనే సినిమాలు రన్ చేస్తామని నిర్ణయం తీసుకున్నట్లు మీడియా ఎదుటే ప్రకటించారు. అయితే ఆ మరునాడే యాక్టివ్ ప్రొడ్యూసర్స్ ఓ మీటింగ్ పెట్టి ఎగ్జిబిటర్లపై సీరియస్ అవడమేగాక వ్యక్తిగతం విమర్శలు చేశారు. పెద్ది సినిమా విడుదల ఉందనే కావాలనే ఇలా పర్సంటేజీ సిస్టం అంటూ రాద్ధాంతం చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు.




పాకిస్తాన్‌కు షాకిస్తూ.. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' సిరీస్ చిత్రాలు ఎలాంటి సక్సెస్‌ను అందుకున్నాయో తెలియంది కాదు. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన ఈ సినిమాలను చూసి పాకిస్తాన్‌కు ఏడుపొక్కటే తక్కువంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరమే లేదు. అలాంటి 'ధురంధర్'కు కౌంటర్ ఇస్తున్నామంటూ పాకిస్తాన్ ఈ మధ్య ఓ చిత్రం విషయంలో తెగ హడావుడి చేసింది. 'ధురంధర్'కు మేమిస్తున్న ధీటైన సమాధానం ఇదే.. అంటూ ప్రమోషన్స్‌లో కూడా చెప్పుకున్నారు. ఇంతకీ ఆ సినిమా పేరు ఏంటంటే.. 'మేరా ల్యారీ'. మరి ఈ సినిమా నిజంగానే 'ధురంధర్'కు కౌంటర్ ఇచ్చిందా? అంటే, అసలు దరిదాపుల్లోకి కూడా రాలేదు. అంతేకాదు, పాకిస్తాన్ పరువును మరింత దిగజార్చింది. తాజాగా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం, ఈ సినిమా విడుదలైన కొద్దిసేపటికే అనేక థియేటర్ల నుంచి తీసివేయబడిందని తెలుస్తోంది. అందుకు కారణం ప్రేక్షకాదరణ లేకపోవడమే. ఈ సినిమాకు మొత్తంగా కేవలం 22 టిక్కెట్లు మాత్రమే అమ్ముడుపోవడంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం. ప్రచారంలో ప్రగల్భాలు పలికి, తీరా ఇలా విడుదలైన కొన్ని గంటల్లోనే థియేటర్ల నుంచి తీసేయడంతో పాకిస్తాన్‌కు ఘోర అవమానం ఎదురైంది. ఈ సినిమా కథా నేపథ్యం ఏమిటంటే.. దర్శకుడు అబు అలీహా తెరకెక్కించిన ఈ చిత్రం, కరాచీలోని 'ల్యారీ' ప్రాంతానికి ఉన్న నెగెటివ్ ఇమేజ్‌ను చెరిపేసేలా, అక్కడ మహిళా ఫుట్‌బాల్ క్రీడ నేపథ్యంలో సాగే స్ఫూర్తిదాయక కథాంశంతో రూపొందించినట్లుగా మేకర్స్ చెబుతూ వచ్చారు. ఇందులో ఆయేషా ఒమర్, దననీర్ మోబీన్, సామియా ముంతాజ్, ట్రిన్నెట్ లూకాస్ ప్రధాన పాత్రలు పోషించారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' చిత్రంలో ల్యారీ ప్రాంతాన్ని క్రైమ్, తీవ్రవాదం, గ్యాంగ్ వార్స్‌కు నిలయంగా చూపించిన విషయం తెలిసిందే. రణవీర్ సింగ్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణంతో రూపొందిన ఈ చిత్రానికి కౌంటర్‌గా 'మేరా ల్యారీ'ని పాకిస్తాన్ ప్రొజెక్ట్ చేసింది. ఈ చిత్రానికి పాకిస్తాన్‌లోని సింధ్ ప్రభుత్వం కూడా బహిరంగంగా మద్దతు తెలిపింది. రాజకీయంగా, మీడియాలో ఎంత హడావుడి జరిగినప్పటికీ, ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో ఈ సినిమా ఘోరంగా విఫలమైంది. దీంతో విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ సినిమాను థియేటర్ల నుంచి తీసివేసి, ఇతర చిత్రాలను ప్రదర్శిస్తున్నారంటే.. ఎంత అవమానకరమైన విషయమో అర్థం చేసుకోవచ్చు.




చాలా రోజులుగా 'పర్సంటేజ్ సిస్టమ్ కావాలని పలువురు ఎగ్జిబిటర్స్ భావిస్తున్నారు. ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్స్ వారు 'పర్సంటేజ్' లేకపోతే తమ మనుగడ సాగదనీ తేల్చేశారు. అయితే 'యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్' లోని కొందరు నిర్మాతలు మాత్రం 'పర్సంటేజ్ సిస్టమ్' వల్ల తాము కోట్ల రూపాయలు నష్టపోతామని అంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం కూర్చుని మాట్లాడుకుందామని నిర్మాతల్లో కొందరు ఆశించారు. అయితే అటు, ఇటు వాదనల మధ్యలో ఉన్నట్టుండి విమర్శలు తలెత్తాయి. ప్రముఖ నిర్మాత నాగవంశీ మాటల్లో నోటెడ్ ఎగ్జిబిటర్ సునీల్ నారంగ్ ను టార్గెట్ చేశారని కొందరి భావన. అదే విషయాన్ని నారంగ్ ముందు పెట్టినప్పుడు దానికి ఆయన నాగవంశీపై సెటైర్స్ వేశారు. ఇలా సమస్య పరిష్కారం కోసం దారులు వెదకడం మరచి కాంట్రవర్సియల్ కామెంట్స్ చేసుకోవడం పరిశ్రమలో చర్చనీయాంశమయింది. సితార ఎంటర్ టైన్ మెంట్స్ అధినేత నాగవంశీ చెప్పక పోయినా, ఆ వందల థియేటర్ల ఎగ్జిబిటర్ సునీల్ నారంగ్ అని చిత్రసీమలో అందరికీ తెలుసు. అందువల్లే నాగవంశీపై సునీల్ నారంగ్ వ్యంగ్యంగా మాట్లాడారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఎగ్జిబిటర్స్ మీడియా మీట్ ఏర్పాటు చేశారు. తామెవరినీ విమర్శించడం లేదని, పర్సంటేజ్ విధానం అమలు చేసి తమను ఆదుకోవాలనే కోరుకుంటున్నామని అన్నారు. 'పెద్ది' సినిమాను టార్గెట్ చేసి, ఈ వివాదం తీసుకు వచ్చామనడం సబబు కాదని తేల్చి చెప్పారు. ఎప్పటి నుంచో 'పర్సంటేజ్' కోసం పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే 15వ తేదీనే సమస్యకు తగిన పరిష్కారం దొరుకుతుందని సి.కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

సి.కళ్యాణ్ ఒక్కరోజులోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు. కానీ, 'పర్సంటేజ్ సిస్టమ్'పై ఎన్నో ఏళ్ళుగా ఎగ్జిబిటర్స్ అభ్యర్థిస్తూనే ఉన్నారు. 'పర్సంటేజ్ సిస్టమ్'పై ఇంత రచ్చ సాగుతున్నా, టాలీవుడ్ బిగ్ ప్రొడ్యూసర్స్ అయిన అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, దిల్ రాజ్, సి.అశ్వనీదత్ వంటివారు బయటకు రాకపోవడంపైనా సినీజనం విచారం వ్యక్తం చేస్తున్నారు. సినిమా రంగంలో కీలకమైన నిర్ణయాలు తీసుకొనే సమయంలో ఈ నలుగురు బిగ్ ప్రొడ్యూసర్స్ ముందుండేవారు. మరి ఈ సారి వారు ముందుకు రాకుండా తమ సన్నిహితులను అటు, ఇటు పంపించడం ఎంతవరకు సబబు అన్నది ప్రశ్న.

కారణాలు ఏవైనా ఈ సమ్మర్ లో సినిమా సందడి ఏ మాత్రం సాగలేదు. జూన్ 4వ తేదీన రామ్ చరణ్ 'పెద్ది' సినిమా వస్తోంది. ఓ పెద్ద సినిమా వస్తోందంటే థియేటర్స్ కళకళలాడతాయి. కాబట్టి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం దిశగా ఇటు ఎగ్జిబిటర్స్, అటు ప్రొడ్యూసర్స్ సాగాలనే టాలీవుడ్ జనం ఆశిస్తున్నారు. ఈ క్రమంలో మే 15వ తేదీనే ఛాంబర్ లో 'పర్సంటేజ్ సిస్టమ్'పై అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని సి. కళ్యాణ్ తెలపడం విశేషం. ఈ మాటలు ఎంతోమంది సినిమా థియేటర్స్ వారికి ఊరటనిస్తున్నాయి. మరి ఎలాంటి పరిష్కారం లభిస్తుందో చూద్దాం.




నిర్మాత ప్రసాద్ వి. పొట్లూరి గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అప్పట్లో వివాదం ఎక్కడ ఉంటే ఆయన అక్కడ ఉండేవాడు. బలుపు సినిమాతో నిర్మాతగా కెరీర్ ని మొదలుపెట్టిన పీవీఆర్ ఆ తరువాత క్షణం, ఊపిరి, బ్రహ్మోత్సవం, మహర్షి లాంటి సినిమాలను నిర్మించాడు. అయితే సడెన్ గా పీవీఆర్ ఇండస్ట్రీ నుంచి కనుమరుగయ్యాడు. ఇండస్ట్రీని ఆయన ఎందుకు వదిలేశాడు అన్న విషయం ఎవరికీ తెలియదు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పీవీఆర్ ఇండస్ట్రీ వదిలి వెళ్ళడానికి కారణం చెప్పాడు.' సినిమాను నిర్మించడమంత దారుణమైన బిజినెస్ ఇంకొకటి లేదు. మనం డబ్బు ఇచ్చి అవమానాలు పడేది కేవలం ఈ బిజినెస్ లోనే ఉంది. మనం డబ్బిచ్చి మనం పెంట వేసుకోవడం అనేది పిచ్చితనం. అందుకే నేను ఫిల్మ్ ఇండస్ట్రీని వదిలేశాను. ఇప్పుడు నిర్మాత అనేవాడు ఒక జోకర్ అయ్యిపోయాడు. సెట్ లో అందరూ నిర్మాతల మీద జోకులు వేసుకుంటున్నారు. డబ్బు పెట్టేది నిర్మాత.. సినిమా సంకనాకిపోతే రోడ్డెక్కేది నిర్మాతనే. అలాంటప్పుడు నిర్మాత అంటే ఎలా ఉండాలి. వెస్టర్న్ స్టూడియోస్ విధానం ఇక్కడ లేదు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085